
నీ సేవలకు సలాం.. శాండీ..

ఎన్నో విజయాలు..
ఎన్నెన్నో అవార్డులు..
గోదావరి పుష్కరాల్లో..
బాంబుల అన్వేషణలో..
కేసుల ఛేదనలో..
అన్ని ఆపరేషన్లలో
సక్సెస్‌ఫుల్..
ఒన్ అండ్ ఓన్లీ.. శాండీ..
పోలీసు శాఖకు
ఎనలేని సేవలు చేసింది
జాగిలం శాండీ..
ఇక.. సెలవంటూ..
విధులకు వీడ్కోలు పలుకుతోంది..
ఉద్యోగ విరమణ చేస్తోంది..
నీ సేవలకు సలాం.. శాండీ..


ఎస్పీకి గౌరవ వందనం చేస్తున్న శాండీ


శాండీకి బహుమతి అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



పోలీసు శాఖకు ఎనలేని సేవలు చేసిన జాగిలం శాండీ ఉద్యోగ విరమణను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి పరిధిలోని శిరసాని పోలీసు పరేడ్ మైదానంలో శాండీని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, సిబ్బంది... పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. 2012లో జన్మించిన శాండీ 2013లో హ్యాండ్లర్ చెన్నప్పతో కలిసి హైదారాబాద్‌లోని మొయినాబాద్‌లో బాంబుల గుర్తింపులో 10 నెలలు శిక్షణ పొందిందన్నారు. వీవీఐపీల సేవలకు వినియోగించామన్నారు. 2015లో గోదావరి పుష్కరాల్లో సమర్థవంతమైన సేవలతో ప్రశంసలు పొందిందన్నారు. గణతంత్ర, స్వాతంత్ర్య వేడుకల్లో శాండీ విధులను డెమోరూపంలో అధికారుల ముందు ప్రదర్శించి, పలు అవార్డులు, రివార్డులు సాధించిందన్నారు. విభజన సమయంలో శాండీని జిల్లాకు కేటాయించారన్నారు. సమర్థవంతమైన సేవలతో జిల్లాకు మంచిపేరు తీసుకు వచ్చిందని ఎస్పీ కొనియాడారు. శాండీ సేవలు 11 సంవత్సరాలు ముగియడంతో పరేడ్ మైదానంలో ఎస్పీ ఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రం అందజేశారు. శాండీని పోలీసు సంరక్షణలో బాగా చూసుకోవాలని హ్యాండ్లర్ ఏఆర్ పీసీ చెన్నప్పను ఎస్పీ ఆదేశించారు

- పుట్టపర్తి రూరల్


జ్యోతి వెలిగిస్తున్న ఆర్‌జే రత్నాకర్

విలువల విద్యతోనే ఆదర్శ జీవితం

● ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, జూలై 5: విలువల విద్యతోనే ఆదర్శ జీవితం సాధ్యమనీ, అందుకు సత్యసాయి విద్యాసంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయని సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతినిలయంలోని సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో సత్యసాయి విద్యావాహిని ఆధ్వర్యంలో జాతీయ విద్యాసదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి, రత్నాకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మానవ జీవితానికి మూలాధారం పంచసూత్రాలైన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అన్నారు. వాటిని పాటించడం ద్వారానే శాంతి స్థాపన సాధ్యమన్నారు. ప్రస్తుతం సాంకేతికతతోపాటు స్వార్థం కూడా పెరిగిందనీ, అది అశాంతికి కారణమవుతోందన్నారు. 2010లో సత్యసాయి విద్యావాహిని ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. సత్యసాయి సేవాసంస్థల ప్రదినిధులు విద్యావాహిని ద్వారా విలువలతో కూడిన విద్యను ప్రపంచ వ్యాప్తంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సత్యసాయి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. సత్యసాయి విద్యావిధానం ఆధునిక గురుకులమని అభివర్ణించారు. మూడురోజులపాటు సదస్సు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి గ్లోబల్‌ట్రస్టు ఛైర్మన్ చక్రవర్తి, సభ్యులు నాగానందం, విద్యావాహిని డైరెక్టర్ కరుణా మున్షి, వలంటీర్లు, శిక్షకులు పాల్గొన్నారు.

ఇసుక.. సులభమిక..!

ఉచిత ఇసుక విధానానికి ప్రభుత్వం పచ్చజెండా
నిర్మాణరంగానికి ఊతం
లక్షలాది కుటుంబాల జీవనోపాధికి బాటలు
8 నుంచి మార్గదర్శకాలు అమల్లోకి..
వైసీపీ పాలనలో పెన్నా, చిత్రావతి నదుల లూటీ
రూ.వందల కోట్లు కొల్లగొట్టిన ఆ పార్టీ పెద్దలు

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

ఇసుక అంటే నిన్నమొన్నటి వరకు బంగారమే. రూ.వేలు ఖర్చు చేసుకోవాలి. అయినా దొరకడం గగనమే. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీవినీ ఎరుగనిరీతిలో జిల్లాలోని పెన్నా, చిత్రావతి నదులతోపాటు వాగులు, వంకల్లో వందల కోట్ల రూపాయల విలువైన ఇసుకను దోపిడీ చేశారు. నిర్మాణరంగంలోని లక్షలాది కుటుంబాల జీవనోపాధికి గండి కొట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించింది. భారీ విజయం సాధించింది. అధికారం చేపట్టగానే ప్రజలకు ఇసుక కష్టాలు తప్పించాలని భావించింది. ఉచితంగా అందజేయాలని నిర్ణయించింది. అమలు చేస్తోంది కూడా. ఈ నిర్ణయంతో గత ఐదేళ్లు వైసీపీ ఇసుకాసురులు చేసిన అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్టు పడనుంది. ఇసుక అందరికీ అందుబాటులోకి రానుంది. ఐదేళ్లు కుదేలైన నిర్మాణ రంగం తాజా నిర్ణయంతో తేరుకోనుంది. ఆ రంగంపై ఆధారపడిన లక్షలాది మంది కుటుంబాల జీవనోపాధికి బాటలు పడనున్నాయి. ఉచిత ఇసుక విధానం అమలుపై ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశంలో ధరలు ఖరారు చేసే అవకాశం ఉంది.


వైసీపీ హయాంలో ఉప్పలపాడు రీచ్‌లో తవ్వకాలు (ఫైల్)

అంతులేని దోపిడీ

జిల్లాలో గత ఐదేళ్లలో ఇసుక రూపంలో వైసీపీ నేతలు రూ.కోట్లు దోపిడీ చేశారు. పెన్నా, చిత్రావతి నదుల్లో ఇసుక రీచ్‌లలో తవ్వకాలకు జేపీ పవర్ వెంచర్ కంపెనీకి ప్రభుత్వం అనుమతులు కట్టబెట్టింది. వాటిని అడ్డం పెట్టుకుని 2013 దాకా జిల్లాలో వైసీపీ నేతలతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు.. అనుచరులను పెట్టి ఇసుక దందా సాగించారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసేదాకా జేపీ, ప్రతిమ కంపెనీల పేరుతో అడ్డంగా దోచేశారు. పెన్నానదిలో కొడిగెనహళ్లి, తుమ్మలకుంట, పరిగి, చిత్రావతిలో దంపెట్ల వద్ద ఓపెన్‌రీచ్‌లను గుర్తించారు. పరిగి, దంపెట్ల రీచ్‌లలో అనుమతులు లేకున్నా ఇసుక తోడేశారు. చిత్రావతి నదిలో ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు, పీసీరేవు, తాడిమర్రి మండలం సీసీరేవు, గరిసనపల్లి రీచ్‌లలో అనుమతులకు మించి రైతుల భూముల్లో సైతం తవ్వకాలు చేపట్టారు. రాత్రింబవళ్లు వందల టిప్పర్లతో ఇసుక రవాణా చేసి, రూ.కోట్లు కొల్లగొట్టారు. పెన్నానదిలో చౌళూరు నుంచి రొద్దం మండలం నారనాగేపల్లి దాకా విచ్చలవిడిగా ఇసుక తవ్వేశారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి పరిధి ఎనుమలపల్లి, రాయలవారిపల్లె, కోవెలగుట్లపల్లి సమీపాన చిత్రావతి నదిలో నీటిలో కూడా ఇసుకను బయటకు తీసి అమ్ముకున్నారు. జయమంగళి, కుషావతి, సువర్ణముఖి, సోమావతి, సీజీ, పెడబల్లి ప్రాజెక్టులతోపాటు నది పరీవాహక ఉపనదులను కూడా వదల్లేదు ఇరుకాసురులు. గత ప్రభుత్వం తొలుత ఇసుక రూ.375 అని చెప్పి.. తర్వాత రూ.475 చొప్పున విక్రయించింది. ఊరూపేరూలేని కంపెనీలకు టెండర్లు కట్టబెట్టి వారి పేరిట ముఖ్యనేతలే నేరుగా ఇసుక వ్యాపారం చేసి రూ.వందల కోట్లు పోగేసుకున్నారు. ఇసుక అమ్మకాల్లో ఆన్‌లైన డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఇవ్వకుండా నగదు తీసుకుని, దందా సాగించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. ట్రాక్టర్ ఇసుక కావాలంటే రూ.5వేలు, లారీ లోడు కావాలంటే రూ.30 వేలదాకా చెల్లించాల్సి వచ్చేది. నదుల్లో తవ్వకాలకు అనుమతుల్లేకున్నా సుప్రీంకోర్టు, హైకోర్టు హెచ్చరించినా ఏమాత్రం పట్టించుకోకుండా ఇసుక అక్రమ తవ్వకాలు సాగించారు. విషయం తెలిసినా గనుల శాఖ అధికారులు వాటి జోలికెళ్లలేదు. నేరుగా సీఎం కార్యాయలం నుంచి ఇసుక తవ్వకాలపై పర్యవేక్షిస్తుండడంతో అన్ని శాఖల అధికారులు మిన్నకుండిపోయారు. ఇలా ఇసుక రూపంలో జిల్లావ్యాప్తంగా 700 కోట్లకుపైగా వైసీపీ పెద్దల జేబుల్లోకి చేరింది.


పుట్టపర్తి వద్ద చిత్రావతి నదిలో ఇసుక తవ్వకాలు (ఫైల్)

నిర్మాణ రంగానికి ఊతం..

గత వైసీపీ పాలనలో ఇసుక దొరక్క నిర్మాణ రంగం కుదేలైంది. కూటమి అధికారం చేపట్టాక ఇసుకను ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో కుదేలైన నిర్మాణ రంగంతేరుకోనుంది. ఈరంగంపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలకు జీవనోపాధికి దొరకనుంది. గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇసుక విధానంతో నాయకులు, అనుచరులకు తప్ప.. ప్రజలకు ఎలాంటి మేలు చేకూరలేదు. ప్రజలపై మోయలేని భారం వేశారు. ఈనేపథ్యంలో ఎన్నికల హామీ మేరకు పకడ్బందీగా ఇసుక విధానం అమలుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రజలపై భారం పడకుండా కసరత్తు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా ముంపు ప్రాంతాల్లో తవ్వకాలకు అయ్యే ఖర్చు తదితరాలపై అంచనాలు, రవాణా చార్జీలు ఎలా వసూలు చేయాలన్న అంశంపై గనుల శాఖ అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. టన్నుకు రూ.88తోపాటు లోడింగ్, రవాణా ఖర్చు మాత్రం తీసుకోనున్నారు. కలెక్టర్లు సమావేశం నిర్వహించి, ధరను ఖరారు చేయనున్నారు.

నెలాఖరు వరకు వేరుశనగ విత్తుకోవచ్చు

పుట్టపర్తి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్

గోరంట్ల, జూలై 5

వేరుశనగను నెలాఖరు వరకు విత్తుకోవచ్చని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్ సూచించారు. స్థానిక సంత మార్కెట్‌లోని ఆర్బీకేలో మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటల సాగుపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ జాన్సన్ మాట్లాడుతూ.. వేరుశనగ సాగుచేయని రైతులు చింతించాల్సిన అవసరం లేదన్నారు. నెలాఖరు వరకు విత్తుకోవచ్చన్నారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చన్నారు. వరినాట్లు వేసేటపుడు కాలి బాటలను వదిలి నాటు కోవాలన్నారు. కాలి బాటలు ప్రతి రెండుమీటర్లకు 20 సెంటీమీటర్ల దూరం వదలాలన్నారు. తూర్పు, పడమర దిశలో కాలిబాటలు వదిలితే, పంటలకు అవసరమైన గాలి, వెలుతురు అంది తెగుళ్లు తగ్గుతాయన్నారు. జొన్న సాగుచేస్తే భూమిలోని సారమంతా పోతుందన్నారు. సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు వాడితే మంచి దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏడీఏ అల్తాఫ్ హుస్సేన్, ఏఓ మునికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో ఆరోగ్యం ముఖ్యం

జిల్లా ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూలై 5: పోలీసు సిబ్బంది లక్ష్య సాధనలో ఆరోగ్యం ముఖ్య భూమిక పోషిస్తుందని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రం పరిధి శిరసాని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఏఆర్ సాయుధ బలగాలు, స్పెషల్‌పార్టీ పోలీసులు, జిల్లాకేంద్రంలోని అర్బన్, రూరల్ పరిధిలోని పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పరేడ్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. నెలలో కనీసం రెండుసార్లు పరేడ్‌లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేసిన 298 మంది హోంగార్డులకు ఎస్పీ జ్ఞాపికలు అందజేసి, సత్కరించారు. నామినేషన్ల ఘట్టం నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు హోంగార్డులు అందించిన సేవలు అమోఘమన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. పరేడ్‌లో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్‌ఐలు చంద్రశేఖర్, వలి, రవికుమార్, ఆర్ఎస్ఐలు, ఏఆర్, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.


పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

117 జీఓను రద్దు చేయండి

మంత్రికి ఉపాధ్యాయ నేతల వినతి

పెనుకొండ టౌన్, జూలై 5: ప్రాథమిక విద్యావ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన 117 జీఓను వెంటనే రద్దు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం 117 జీఓను తీసుకొచ్చి, ప్రాథమిక విద్యావ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలను విలీనం చేసిందన్నారు. వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. టీచర్ల కొరత తీవ్రమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్కూళ్లు అందుబాటులో లేక పేదల పిల్లలు విద్యకు దూరమవుతున్నారని వాపోయారు. జీఓ 117ను రద్దుచేసి, పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుదాకర్, శ్రీనివాసులు, నరేష్‌కుమార్, సునీల్‌కుమార్, నారాయణస్వామి, రమేష్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.


మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జిల్లా వార్షిక రుణ వితరణ లక్ష్యం రూ.11,800 కోట్లు

బ్యాంకర్లు విరివిగా రుణాలివ్వాలి
జేసీ అభిషేక్ కుమార్ సూచన

పుట్టపర్తి, జూలై 5: జిల్లా వార్షిక రుణ వితరణ లక్ష్యం రూ.11,880గా నిర్ణయించినట్లు జేసీ అభిషేక్ కుమార్ తెలిపారు. లక్ష్యాలను బ్యాంకర్లు సకాలంలో అధిగమించాలని ఆయన ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. పరిశ్రమలు, వ్యవసాయం, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులు సమన్వయంతో లక్ష్యాలను అధిగమించాలన్నారు. వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించాలన్నారు. నాబార్డు ద్వారా అమలుచేసే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంఎస్ఎంఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.150 కోట్ల రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అందుకణుగుణంగా బ్యాంకులు రుణాలివ్వాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు కోళ్ల, పొట్టేళ్ల, పందుల యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు అందజేయాలన్నారు. సంక్షేమ పథకాలకు ప్రణాళికలు రూపొందించాలని జేసీ ఆదేశించారు. అనంతరం లీడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి గిరిధర్, నాబార్డు పీడీఎం అనురాధ, ఎల్డీఎం రమణ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏపీజీబీ ప్రతినిధి రమేష్, మెప్మా పీడీ విజయలక్ష్మి, నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న జేసీ, అధికారులు

అద్దెకు.. అంగన్‌వాడీ భవనం..

కాంట్రాక్టర్ నిర్వాకం... పట్టించుకోని అధికారులు

నల్లచెరువు, జూలై 5: అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ప్రైవేటు వ్యక్తులకు అద్దెకిచ్చాడు ఓ కాంట్రాక్టర్. బిల్లులు అందక మండలంలోని ఉప్పార్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం కోసం నిర్మించిన భవనాన్ని వైసీపీ నాయకుడు, కాంట్రాక్టర్ అద్దెకిచ్చిన విషయం వెలుగు చూపింది. అంగన్‌వాడీ విద్యార్థులు మాత్రం సౌకర్యాలు లేని అద్దె భవనంలో ఉంటున్నారు. బిల్లులు కాలేదని ఆ వైసీపీ కాంట్రాక్టర్ భవనాన్ని.. అంగన్‌వాడీ సిబ్బందికి అప్పగించకుండా గ్రామానికి చెందిన రజకులకు అద్దెకివ్వడం చర్చనీయాంశమైంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రజలు మండిపడుతున్నారు. అద్దె భవనంలో కనీస సౌకర్యాలు కొరవడడంతో పిల్లలను అంగన్‌వాడీకి పంపడానికి తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. ఉప్పార్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో దాదాపు 15 మంది విద్యార్థులున్నారు. అద్దె భవనంలో సౌకార్యల కొరత వేధిస్తోంది. మూత్రశాలలు కూడా లేవు. ఇరుకు గదిలో కొనసాగిస్తున్నారు. ఇలాంటి కేంద్రానికి తమ చిన్నారులను ఎలా పంపేదని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోలేదడంలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అంగన్‌వాడీ కేంద్రాన్ని నూతన భవనంలో నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అద్దెకిచ్చిన అంగన్‌వాడీ కేంద్రం భవనం

అద్దె భవనంలో నిర్వహిస్తున్నది వాస్తవమే..

ఉప్పార్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవణంలో నిర్వహిస్తున్న మాట వాస్తవమే. నూతన భవన నిర్మాణానికి నిధులు ఏ మేర మంజూరయ్యాయో, బిల్లులు అందాయో.. లేదో తెలియదు.

- గంగరత్నమ్మ, సీపీపీఓ, నల్లచెరువు


అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



మొదటి ప్యాకేజీలో పూర్తయిన ఆధునికీకరణ పనులు

ఇప్పుడైనా..!

- జీబీసీ నీటి కోసం రైతుల నిరీక్షణ
- రూ.243 కోట్లతో ఆధునికీకరణ ప్రారంభం
- పనులను అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లు బీడుగా ఆయకట్టు భూములు
- కూటమి అధికారంలోకి రావడంతో చిగురిస్తున్న ఆశలు

విడపనకల్లు, జూలై 5: ఉరవకొండ నియోజకవర్గంలో రైతులకు ముఖ్యంగా మిరప సాగు చేసినవారికి జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కాలువ) ప్రాణధారం. విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో సాగు చేసిన పంట పొలాలకు ఈ కాలువ ద్వారానే నీరందుతుంది. అందుకే నియోజకవర్గ రైతుల పంట పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇప్పించడానికి అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పయ్యావుల కేశవ్(ప్రస్తుత మంత్రి) యత్నించారు. ఇందుకోసం రూ.243 కోట్ల నిధులు మంజూరు చేయించి, జీబీసీ ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఈ పనులను రెండు ఫేజ్‌లలో చేపట్టారు. మొదటి ఫేజ్‌లో 1వ కిలోమీటర్ నుంచి 28వ కిలోమీటర్ వరకూ 100శాతం పనులు పూర్తి చేశారు. 2వ ఫేజ్‌లో 28వ కిలోమీటర్ నుంచి 60వ కిలో మీటర్ వరకూ రూ. 123 కోట్లతో పనులు చేపట్టారు. అయితే పనులు పూర్తి కాకనే టీడీపీ అధికారం కోల్పోయింది. దీంతో 30శాతం పనులు నిలిచిపోయాయి. ఈ (9వ కాలువ) పనులను వైసీపీ ప్రభుత్వం చేపట్టకపోవటంతో ఐదేళ్ల నుంచి ఆయకట్టు పొలాలు బీళ్లుగా మారాయి. అంచనహాళ్ గ్రామం వద్ద ప్రధాన కాలువ పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ ప్రాంత రైతులతో పాటు ఖాజీపురం, కొట్టాల, గుంతకల్లు రైతులు వర్షాధారంగా పంటలు వేసుకొని లక్షల్లో నష్టపోయారు. సాగు నీరు బంద్ అయిన సమయంలో కూడా హంద్రీనీవా నీటిని జీబీసీకి తీసుకురావటంలో వైసీపీ నాయకులు విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి.

ఎక్కడపడితే అక్కడ రంధ్రాలు

జీబీసీకి నీళ్లు వచ్చిన సందర్భంలో నాన్ ఆయకట్టు రైతులు ఎక్కడ పడితే అక్కడ అక్విడెక్ట్‌లకు, అండర్ టన్నెళ్లకు రంధ్రాలు వేస్తున్నారు. దీంతో సాగు నీరు వంకలకు వెళ్తోంది. దీనివల్ల అసలైన ఆయకట్టు రైతులు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని వైసీపీ నేతలు అరికట్టకపోగా నాన్ ఆయకట్టు రైతులకు అండగా నిలిచారు. కాలువపై మోటార్లు వేసుకుని సాగు నీరు వాడుకుంటున్న రైతులను సైతం ఎవరూ అడ్డుకోలేకపోయారు. ప్రతి ఏటా గుత్తలు కట్టే ఆయకట్టు రైతుల పొలాలు మాత్రం నీటితో తడవ లేదు. అందుకే జీబీసీ ఆధునికీకరణ పనులు త్వరగా పూర్తి చేస్తే సాగు నీటి సమస్యలు తీరుతాయని రైతులు పేర్కొంటున్నారు. 1వ కిలోమీటర్ నుంచి 60వ కిలోమీటర్ వద్ద వరకూ ఉన్న 25 బ్రిడ్జిలు, 4 అండర్ టన్నెళ్లు 70 ఏళ్ల కిందట నిర్మించిన వని, ఇవి పూర్తిగా శిథిలమై పోవటంతో సాగు నీరు వంకలకు వృథాగా పోతోందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.



16వ కిలోమీటర్ వద్ద అండర్ టన్నెల్‌కు రంధ్రం

19వ కిలోమీటర్ వద్ద కాలువకు రంధ్రం



6వ కాలువకు సాగు నీరు అందకపోవడంతో ప్రధాన కాలువను ధ్వంసం చేసిన ఆయకట్టు రైతులు



5వ కాలువ వద్ద షట్టర్లు ధ్వంసం చేసి ఎత్తుకెళ్లిన దుండగులు

ప్రతిసారీ నష్టాలే



జీబీసీ ఆధునికీకరణ పనులు చేపట్టిన తరువాత ప్రభుత్వం మారిపోయింది. మిగిలిన పనులను వైసీపీ ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో సాగు నీరు అందక మిరప పంటలు సాగ చేసిన ప్రతి సారీ నష్టాలే వచ్చాయి. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో పనులు పూర్తి చేసి, సాగు నీరు అందిస్తారని ఆశిస్తున్నాం.

- మనోహర, రైతు, ఆర్ కొట్టాల

ఐదేళ్లుగా పట్టించుకోలేదు



టీడీపీ ప్రభుత్వంలో ఆధునికీకరణ పనుల్లో భాగంగా 9వ కాలువను వెడల్పు చేసి వదిలేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కనీసం సైడ్ వాల్స్ లైనింగ్ కాని బేస్‌మెట్ సిమెంట్ కానీ చేయలేదు. దీంతో కాలువకు సాగునీరు రాక గడేకల్లు, కడదరబెంచి, డొనేకల్లు, గ్రామాలో వేల ఎకరాల పొలాలు బీళ్లుగా మారాయి. కూటమి ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందనిపిస్తోంది.

- పరశురాముడు, రైతు, గడేకల్లు

మరమ్మతులు చేయించి, సాగు నీరు అందిస్తాం

జీబీసీలో 1వ కిలోమీటర్ నుంచి 60వ కిలోమీటర్ వరకూ ఉన్న 28 బ్రిడ్జిలను రిపేర్లు చేయించేందుకు దాదాపు రూ.4కోట్లతో ప్రతి పాదనలు పంపాం. నిధులు రాగానే పనులు పూర్తి చేస్తాం. ప్రస్తుతం బ్రిడ్జిల వద్ద రంధ్రాలు, కూల్చిన గోడలను మరమ్మతులు చేయిస్తున్నాం. ఆగస్టు నెలలో సాగు నీరు వచ్చే లోగా డ్యామేజ్‌లు ఉన్న చోట పనులు పూర్తి చేసి రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందిస్తాం.

- రాజశేఖర్, జీబీసీ ఏఈ, విడపనకల్లు

బాలిక కిడ్నాప్.. నిందితుడిపై పోక్సో కేసు



నిందితుడు కొల్లప్ప

కుందుర్పి, జూలై 5: ప్రార్థనల పేరుతో విద్యార్థినిపై కన్నేసిన వ్యక్తిపై పోలీసులు పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేశారు. బ్రహ్మసముద్రం మండలం చెలిమేపల్లికి చెందిన 47 సంవత్సరాల వయసుగల కొల్లప్ప కుందుర్పిలో ఓ ప్రార్థనా మందిరంలో పని చేస్తున్నాడు. ప్రార్థనలు చేస్తే సమస్యలు తీరుతాయని చుట్టుపక్కల ప్రజలను నమ్మించి వారికి చేరువయ్యాడు. ప్రతి ఆది, సోమవారాల్లో ప్రార్థనలు నిర్వహించేవాడు. బాధిత విద్యార్థి ఇంట్లో కూడా ప్రార్థనలు చేస్తూ కూలి పనులు చేసుకునే ఆమె తల్లిదండ్రులకు చేరువయ్యాడు. వారికి తనపై పూర్తి స్థాయిలో నమ్మకాన్ని కలుగజేసుకున్నాడు. ఈ క్రమంలోనే గతనెల 29న అనంతపురంలో ప్రార్థనల కోసమని బాలికను తీసుకెళ్లాడు. అయితే అనంతపురంలో ప్రార్థనలకు కాకుండా విజయవాడకు కారులో విద్యార్థినిని ఎత్తుకెళ్లాడు. మరుసటి రోజు ఏలూరులో ఒక ఇంట్లో ఉంచాడు. తల్లిదండ్రులు కొల్లప్పను ఫోన్‌లో సంప్రదించగా, పని చేయలేదు. దీంతో అనుమానం వచ్చి కుందుర్పి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేసుకుని, గాలింపు చర్యలు చేపట్టారు. కాగా విద్యార్థినితో కొల్లప్ప అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె ససేమిరా అనడంతో భయపడి తిరిగి కుందుర్పికి తీసుకువచ్చి వదిలేశాడు. ఇంటికి వచ్చిన బాధితురాలు, జరిగిన విషయం తల్లిదండ్రులకు వివరించింది. పోలీసులు గురువారం సాయంత్రం మహంతపురం గ్రామ సమీపాన కొల్లప్పను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అతనిపై పోక్సో కిడ్నాప్ కేసులను నమోదు చేసి, శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు



అనంతపురం రూరల్, జూలై 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 709 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నీటి ప్రాజెక్టులను పరిశీలించిన కేంద్ర బృందం



పీఏబీఆర్‌ను పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ అధికారుల బృందం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 5: జిల్లాలోని పీఏబీఆర్, హెచ్ఎల్ఎంసీలను కేంద్రజలశక్తి అభియాన్ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. జలశక్తి అభియాన్ కేంద్ర అధికారులు అరులానందన్, శాస్త్రవేత్త షరీఫ్ ఖాన్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్‌బాషా, హెచ్చెల్సీ ఈఈ శ్రీనివాసుల బృందం ఆయా ప్రాంతాలను పరిశీలించింది. తొలుత హెచ్చెల్సీ పరిధిలోని పీఏబీఆర్ డ్యాంకు వెళ్లిన అధికారుల బృందం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం, నాణ్యత, లీకేజీ, మొక్కలు పెరిగిన పరిస్థితులను పరిశీలించారు. పూర్తిస్థాయి నీటి నిల్వకు అవసరమైన భూసేకరణ, డ్యాం నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం హెచ్ఎల్ఎంసీ ప్రధాన కాలవను పరిశీలించారు. అక్కడ పీఏబీఆర్ లింక్‌చానల్ సామర్థ్యం, నాణ్యతను పరిశీలించారు. ఈమేరకు అధ్యయనం చేసిన అంశాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు. తరచూ డ్యాం పర్యవేక్షణ చేయాలని, మరమ్మతులకు సంబంధించి ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. డ్యాం, హెచ్చెల్సీ నిర్వహణ పై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వహణ లేకపోతే తీరని నష్టం జరిగే ప్రమాదముందని హెచ్చరించారు.

డీఈఓ గారు..! ఫోన్ ఎత్తండి..

- సమస్యలపై ఫోన్ చేస్తే స్పందించని అధికారి
- ప్రవేశాల వేళ నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం
- ఉన్నతాధికారి తీరు పట్ల విద్యార్థి సంఘాల మండిపాటు



జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం

అనంతపురం విద్య, జూలై 5: సమస్యలు ఏవైనా ఉంటే ఈ 9849909112కి ఫోన్ చేయమంటారు. కానీ ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయరు. మరి మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి అని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థులు, వేలాది టీచర్లు, ఉద్యోగులు పనిచేసే విద్యాశాఖ ఉన్నతాధికారి ఫోన్ నెంబర్ అది. జిల్లా ఉన్నతాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజల నుంచి వచ్చే గ్రీవెన్సులను, ఇతర సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత వారిది. ప్రస్తుతం స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్రవేశాల సమయం, పైగా అనేక సమస్యలు క్షేత్రస్థాయిలో ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు వీలు లేని ప్రజలు, జిల్లాకేంద్రానికి వచ్చేందుకు ఆర్థిక స్తోమత లేని విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్ ద్వారా సంప్రదిస్తారు. అయితే జిల్లా విద్యాశాఖాధికారి అటు విద్యార్థుల తల్లిదండ్రులకు కానీ, ఇటు ప్రజలు, విద్యార్థి సంఘాల నేతలకు కానీ ఫోన్‌లో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రవేశాల వేళ....జిల్లా విద్యాశాఖాధికారి స్పందించకపోవడంపై ఆయా వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రైవేట్ స్కూళ్లపైనే శ్రద్ధ



జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు విచ్చల విడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అనేక స్కూళ్లకు అనుమతులు లేవు. విచ్చల విడిగా యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయి. అనేకసార్లు ధర్నాలు చేశాం, ఇతర రూపాల్లో నిరసనలు తెలిపాం. పలుమార్లు గ్రీవెన్సులో వినతులు ఇచ్చాం. ఇప్పటి వరకూ ఆయా స్కూళ్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. డీఈఓకు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై ఉన్న శ్రద్ధ, పబ్లిక్ గ్రీవెన్సులపై ఉండటం లేదు. ఫోన్ చేస్తే స్పందనే ఉండదు. ఈ నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

- పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కొనసాగిన సీబీఐ విచారణ

డీఆర్ఎం, సీనియర్ డీఎఫ్ఎం ఇళ్లలో సోదాలు

గుంతకల్లు, జూలై5: స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో అవినీతిపై సీబీఐ అధికారులు చేపట్టిన విచారణ శుక్రవారం రాత్రి దాకా కొనసాగింది. గురువారం సాయంత్రం డీఆర్ఎం కార్యాలయంపై సీబీఐ దాడి జరిగిన సంగతి పాఠకులకు విదితమే. కడప వద్ద నిర్మించనున్న ఓ రైలు వంతెన పనికి సంబంధించి యాక్సెప్టెన్సీ ఉత్తర్వుల జారీ కోసం అకౌంట్స్ విభాగ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బును డిమాండ్ చేయగా, రమేశ్‌రెడ్డి అనే బాధిత కాంట్రాక్టరు నుంచి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దాడులు జరిగాయి. సీనియర్ డీఎఫ్ఎం ప్రదీప్‌బాబు, అకౌంట్సు విభాగం ఓఎస్ బాలాజీతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు వారిలో ఒకరిని అప్రూవర్‌గా మార్చి, నిందితుల జాబితా నుంచి తొలగించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువా రం రాత్రి సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజరు ప్రదీప్ బాబు ఇంట్లో సీబీఐ అధికారులు సోదాలను నిర్వహించారు. రాత్రి పొద్దుపోయేదాకా డీఆర్ఎం కార్యాలయంలో అదుపులో ఉన్న నిందితులను విచారణ చేశారు. శుక్రవారం ఉదయం డీఆర్ఎం వినీత్ సింగ్ నివాసమున్న క్వార్టర్సుకు వెళ్లి అక్కడ కూడా తనిఖీలు జరిపినట్లు తెలిసింది. పలు రైలు వంతెనలకు జరిగిన ఈ భారీ టెండరు కేటాయింపులో డీఆర్ఎం ప్రమేయం ఉంటుంది. ఈ మేరకు కాంట్రాక్టరు నుంచి వసూలు చేసిన లంచం విషయంగా డీఆర్ఎం ప్రమేయంపై కూడా విచారణ చేపట్టినట్లు సమాచారం. ఉదయం నుంచి రాత్రి వరకూ డీఆర్ఎం ఇంట్లో సోదాలను నిర్వహించి, మరలా ఆయన కార్యాలయానికి వచ్చి కేసు రిపోర్టులను తయారు చేసినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి విచారణ పూర్తిచేసి నిందితులను సికింద్రాబాద్‌లోని సీబీఐ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించనున్నట్లు తెలిసింది.

విలేకరులకు నో ఎంట్రీ

సీబీఐ దాడి నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు డీఆర్ఎం కార్యాలయంలోకి రాకుండా ఆర్పీఎఫ్ సిబ్బందిని కాపలాగా ఉంచారు. లంచం డిమాండ్, ఉన్నతాధికారుల అరెస్టుకు సంబంధించిన సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడినా వార్తలు రావడంతో శుక్రవారం విలేకరులు డీఆర్ఎం కార్యాలయంలోకి వెళ్లకుండా నిరోధించేందుకు యత్నించారు. అవినీతిపై దాడి, అధికారుల అదుపు విషయంగా అటు సీబీఐ అధికారులుగానీ, ఇటు డీఆర్ఎం కార్యాలయంగానీ అధికారిక సమాచారం వెల్లడించ లేదు.

నేడు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్, జూలై 5: ఓ ప్రైవేట్ సంస్థల్లో వంద పోస్టులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి తెలిపారు. 18 నుంచి 27ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగ యువకులు ఇంటర్మీడియేట్, డిగ్రీ విద్యాభ్యాసం చేసిన వారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు ఉమ్మడి జిల్లాలో స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో క్రెడిట్ అసిస్టెంట్స్‌గా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు వారి బయోడేటా, అర్హత గల సర్టిఫికెట్స్, వాటి జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు.

నేడు పెంపుడు కుక్కలకు రేబిస్ టీకా

అనంతపురం అర్బన్, జూలై 5: జిల్లాలోని పశువైద్యశాలల్లో శనివారం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకా ఉచితంగా వేయనున్నట్లు పశు సంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్య శాలల్లో టీకా అందుబాటులో ఉంచామన్నారు. పెంపుడు కుక్కల యజమానులు తప్పని సరిగా కుక్కలకు రేబీస్ టీకా వేయించాలని సూచించారు.

నోడల్ అధికారులకు అవగాహన సదస్సు

అనంతపురం విద్య, జూలై 5: జిల్లాలో పోష్ యాక్ట్-2013 కింద నోడల్ ఆఫీసర్లుగా నియమితులైన వారికి శనివారం కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు ఉంటుందని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పని ప్రాంతాల్లో లైంగిక వేధింపుల నియంత్రణకు కలెక్టర్ నోడల్ అధికారులకు నియమించారన్నారు. ఆ అధికారులకు శనివారం సాయంత్రం 4 గంటలకు రెవెన్యూ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైసీపీ దాడిలో నలుగురికి తీవ్రగాయాలు

స్థల వివాదం.. ఇరువర్గాల ఘర్షణ

పెనుకొండ రూరల్, జూలై 5: అధికారం కోల్పోయినా వైసీపీ నాయకులు గ్రామాల్లో టీడీపీ సానుభూతిపరులపై దాడులకు తెగబడుతున్నారు. రొద్దం మండలం పెద్దకోడిపల్లిలో స్థల వివాదంపై వైసీపీ నాయకులు దాడి చేయడంతో టీడీపీ సానుభూతిపరులైన నలుగురు మహిళలు శుక్రవారం తీవ్రంగా గాయపడ్డారు. బాధిత మహిళలు సరస్వతమ్మ, నాగరంగమ్మ, అక్కమ్మ, చిట్టి దాడి విషయాలు వివరించారు. పెద్దకోడిపల్లిలో బాధితుల ఇంటి సమీపంలో వంకనీరు వెళ్లే విషయంగా 2018 సంవత్సరంలో కోర్టును ఆశ్రయించామన్నారు. వివాదస్థలంలో ఎలాంటి అక్రమ కట్టడాలు కట్టరాదని గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులైన నరసింహప్ప, పోతన్నలకు కోర్టు నోటీసులు ఇచ్చిందన్నారు. వీటిని ధిక్కరించి పోలీసు అండదండలతో వివాదాస్పద భూమిలో రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. శుక్రవారం ఉదయం తాము స్థలం వద్దకు వెళ్లి కోర్టు పరిధిలో ఉన్న భూమిలో అక్రమ నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నించగా మూకుమ్మడిగా వైసీపీ సానుభూతిపరులైన పోతన్న, గోవిందయ్య, నరసింహులు, రమేష్, పోతన్న, నరసింహులు, నాగరాజు, వెంకటేశులు, నరేష్, సుశీలమ్మ, సుభాషిణి, అక్కమ్మ, అమృత, శాంతి దాదాపు 15మంది మూకుమ్మడిగా రాడ్లు, కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. గాయపడిన తమను స్థానికులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అక్కమ్మ, చిట్టిలను మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ విషయంపై రొద్దం ఎస్ఐ వలీబాషను వివరణ కోరగా పెద్దకోడిపల్లి స్థల వివాదంపై ఘర్షణ పడ్డ సంగతి వాస్తవమేనన్నారు. ఈ ఘర్షణపై ఎవరూ ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

గూగూడు ఉత్సవాలను జయప్రదం చేయండి



అగ్నిగుండాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

నార్పల, జూలై 5: మండలంలోని గూగూడులో ఈనెల 7నుంచి 17 వరకు జరిగే కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన గూగూడులో శుక్రవారం ఆయన పర్యటించి, అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మొదట గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి లోటు పాట్లు వసతులు కల్పించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం కాబట్టి పారిశుధ్యపనులు ఎప్పటికప్పుడు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. గ్రామంలో 50మంది యువకులను ఓ బృందంగా ఏర్పాటు చేసుకుని పోలీస్ శాఖ వారు బ్రహ్మోత్సవాల్లో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, డీపీఓ ప్రభాకర్‌రావు, స్పెషల్ అధికారి రామసుబ్బారెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గుత్తి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం సుభాన్

గుత్తి, జూలై 5: పట్టణంలోని కోట వీధి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తిరుమల జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సుభాన్ శుక్రవారం తెలిపారు. ఈ విద్యార్థి పారా అథ్లెట్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో షార్ట్‌పుట్, జావలిన్‌త్రో, డిస్కత్రో క్రీడల్లో ప్రతిభ చూపించాడు. ఈనెల 16న బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పారా అథ్లెట్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించి, సర్టిఫికెట్‌లను అందజేశారు.

నేడు జిల్లాకు శాస్త్రవేత్తల బృందం రాక

అనంతపురం అర్బన్, జూలై 5: వివిధ రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తల బృందం శనివారం జిల్లా పర్యటనకు రానుంది. భారతీయ ఉద్యాన పరిశోధన కేంద్రం బెంగళూరు నుంచి 10 మందితో కూడిన వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తల బృందం సభ్యులు శనివారం ఉదయం జిల్లాకు చేరుకోనున్నారు. స్థానిక డ్వామా హాల్‌లో శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖ అధికారులతో సమావేశమవుతారు. అనంతరం గార్లదిన్నె లేదా బత్తలపల్లి, ఇతర మండలాల్లో క్షేత్ర స్థాయిలో చీనీ, నర్సరీలను పరిశీలించనున్నట్లు సమాచారం. ఆదివారం రెండో రోజు శాస్త్రవేత్తల బృందం సభ్యులు ఇతర ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చెత్త తొలగించారు..



చెత్తను తొలగిస్తున్న అధికారులు

అమడగూరు, జూలై 5: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద కుప్పలు కుప్పలుగా చెత్త పేరుకుపోయింది. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు ఆ చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

20న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ధర్మవరం, జూలై 5: ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచల గిరిప్రదర్శన, కాణిపాకానికి ఈనెల 20న ఉదయం 6 గంటలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21న పౌర్ణమి సందర్భంగా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అరుణాచలానికి రానుపోను చార్జీలు రూ.1400 అవుతుందని, దర్శనానికి వెళ్లేవారు బస్సు కౌంటర్‌లో కానీ ఆన్‌లైన్‌లో కానీ సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 63031 51302, 99592 25859 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు వీహెచ్‌పీ నిరసన ర్యాలీ

ధర్మవరం, జూలై 5: హిందువులపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం ధర్మవరం పట్టణంలో విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్ ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం 9-30 గంటలకు కాలేజ్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు. అక్కడ నిరసన కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. కావున హిందూ సంఘాలు, భజన సంఘాలు, దేవాలయ కమిటీ, వివిధ సేవాసంస్థలు హాజరుకావాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

కదిరిఅర్బన్, జూలై 5: కదిరి డిపో పరిధిలోని ప్రయాణీకుల సమస్యలను తెలుసుకోవడానికి శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మైనోద్దీన్ తెలిపారు. ఈ సమయంలో ప్రయాణీకులు తమ సమస్యలను 0849-224244కు ఫోన్ చేసి తన దృష్టికి తేవాలని కోరారు.

నేటి నుంచి కుక్కలకు ర్యాబిస్ టీకాలు

గాండ్లపెంట, జూలై 5: మండలంలోని పెంపుడు కుక్కలకు శనివారం నుంచి ర్యాబిస్ టీకాలు వేస్తామని పశువైద్యాధికారి చెన్నకేశవుల నాయక్ శుక్రవారం తెలిపారు. కుక్కల ద్వారా పాడి పశువులకు, మనుషులకు ర్యాబిస్ వ్యాధి వ్యాపించే అవకాశముందని, కావున కుక్కలకు ముందుస్తు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

మట్టి పరీక్షలు

నంబులపూలకుంట, జూలై 5: మండలంలోని మేకలచెరువు, ఎదురుదొన్న గ్రామాల్లోని ఆర్బీకే పరిధిలో రైతుల నుంచి సేకరించిన మట్టి నమూనాలను ఏఓ లోకేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... మండలవ్యాప్తంగా 413 మట్టినామూనాలను సేకరించాల్సి ఉందని, ఒక్కొక్క ఆర్బీకే పరిధిలో 41 మట్టి నమూనాలను సేకరించాలని అన్నారు. రైతు పొల్లాలో భూసారాన్ని తెలుసుకోవాలంటే తప్పకుండా మట్టి నమూనాలను సేకరించాలని, తద్వారా ఆ భూమిలో పోషకాలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకోవచ్చని అన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మట్టి నమూనాలు సేకరించినట్లు అయితే ఆ భూమిలో చౌడు, సున్నం, నేల కాలుష్యాని గుర్తించేందుకు అవకాశముంటుందన్నారు. ఏఏ పంటలు సాగుచేయడానికి అనుకూలంగా ఉందో తెలుస్తుందన్నారు.

విద్యార్థులకు ముగిసిన శిక్షణ

కదిరిఅర్బన్, జూలై 5: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై 15 రోజులుగా ఇస్తున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. యువతలో జీవన నైపుణ్యాలు పెంపొందించడం, ఇంగ్లీషుపై పట్టు సాధించడం కోసం బెంగుళూరులోని ఉన్నతీ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ శిక్షణ ఇప్పించారు. శిక్షణకు లైఫ్ కోచ్‌గా బాలాజీనాయక్ వ్యవహరించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ నారాయణ అభినందించారు.

బీసీ హాస్టల్ తనిఖీ



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

నల్లచెరువు, జూలై 5: స్థానిక బాలుర వసతి గృహాన్ని కదిరి ఆర్డీవో వంశీకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. వసతి గృహ పరిసరాలను, వంటగదిని పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వార్డెన్ లక్ష్మీనారాయణకు సూచించారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాబోధన, ఉత్తీర్ణత శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ రవికుమార్, వసతిగృహం సిబ్బంది ఉన్నారు.

సచివాలయం, ఆరోగ్యం కేంద్రం..

కదిరి అర్బన్: మండలంలోని పట్నం గ్రామ సచివాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీఓ ఆంజనప్ప శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులు పరిశీలించారు. విధులకు హాజరుకాని వారికి జీతంలో కోత విధించాలని కార్యదర్శిని ఆదేశించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. డయేరియా ప్రబలుతోందని, ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వనజ, సర్పంచ్ చలపతినాయక్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో..

కొత్తచెరువు : స్థానిక ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి నటరాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్ట్రర్‌లను, నిల్వ ఉన్న ఎరువులను, పురుగు మందులను, విత్తనాలను పరిశీలించారు. నకిలీ ఎరువులు, పురుగుల మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాటిని అమ్మేటప్పుడు బిల్లు బుక్కులో వాటి లాట్ నెంబర్ల కోడ్‌ను తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. రైతులు కూడా వాటిని కొనుగోలు చేసేటప్పుడు బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఏదైనా పంట నష్టం జరిగితే కంపెనీ నుంచి పరిహారం అందేందుకు వీలుంటుందని ఆయన తెలిపారు.

కనీస సౌకర్యాల్లేని మలకవారిపల్లి

● అధ్వానంగా రోడ్డు ● తాగునీరూ కరువే ● అంగన్‌వాడీ కేంద్రం లేదు ● పక్కాగృహాల ఊసేలేదు



మలకవారిపల్లి రహదారి దుస్థితి



శిథిలమైన గృహాల ముందు సమస్యలు వివరిస్తున్న గ్రామస్థులు

నల్లచెరువు, జూలై 5: మండలంలోని మలకవారిపల్లిలో కనీస సౌకర్యాలు లేక ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి వెళ్లడానికి సరైన రోడ్డూ లేదు. గ్రామంలో తాగునీటి సౌకర్యమూ లేదు. గత ఐదేళ్లలో గ్రామంలో ఏ ఒక్క పక్కాగృహం మంజూరు కాలేదు. గ్రామంలో 30 కుటుంబాలు ఉన్నారు. అందరూ కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవారే. మండల కేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో.. మండలం సరిహద్దులో ఈ గ్రామముంది. మలకవారిపల్లి గ్రామానికి పక్కన గాండ్ల పెంట మండలంలోని సామచేనుబైలు గ్రా మం ఉంది. మండల కేంద్రానికి చివర ఉండడమే ఈ గ్రామానికి శాపంగా మారింది. అందువల్లే కనీస సౌకర్యాలకు దూరమవు తున్నామని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో 15 మంది చిన్నారులున్నారని, గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పక్క మండలంలో కిలోమీటరు దూరంలోని సామచేను బైలుకు పంపుతున్నామని అన్నారు. గత టీడీపీ పాలనలో గ్రామానికి సీసీ రోడ్డు వేశారని, తాగునీటి పథకం ద్వారా ట్యాంక్ ఏర్పాటు చేశారని అన్నారు. అయితే తాగునీటి పథకం బోరు చెడిపోవడంతో గత వైసీపీ పాలకులు ఏ మాత్రం పట్టిం చుకోలేదన్నారు. దీంతో నీటి ట్యాంక్, కొళాయిలు కూడా ధ్వంసమయ్యాయన్నారు. ప్రస్తు తం తాగునీటి బోరులో నీరు పుష్కలంగా ఉన్నా.. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాగునీటి సమస్యపై పలుమార్లు గ్రామస్థులంతా మండల కేంద్రానికి వచ్చి ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లామని, ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశామని, అయినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామస్థులు కౌసల్య, ఆదినారాయణ, రామ క్రిష్ణ, వెంకటరమణ, గోవిందు, నాగరాజు, రాజేశ్వరీ విజ్ఞప్తి చేస్తున్నారు.



మూలనపడ్డ తాగునీటి పథకం

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



సభలో మాట్లాడుతున్న అధికారులు



పాల్గొన్న క్రీడాకారులు

బుక్కపట్నం, జూలై 5: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ మగ్బుల్ బాషా, ప్రధానోపాధ్యాయుడు జగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం బుక్కపట్నంలో ఉమ్మడి జిల్లాల షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి తరుణ్, హర్షవర్ధన్, సాయిజేశ్వంత్, నవీన్, గణేష్, నారాయణస్వామి, కేదార్‌నాథ్, మారుతి, రాజా... బాలికల విభాగం నుంచి వర్షిణీ, అక్షయ, శాలిని, మైత్రీ, రక్షిత, సాయిభార్గవి ఎంపికయ్యారన్నారు. వీరు ఆగష్టులో గుంటూరులో నిర్వహించే 43వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసిసోషియేషన్ సెక్రటరీ మనోహర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ పూల ప్రసాద్, కేజీబీవీ ఎస్‌ఓ సౌజన్య, పీడీలు నాగరాజు, జయప్రసాద్, రేఖ, రమాదేవి, స్వర్ణకుమారి, నవనీత, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి ఎస్‌ఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న పావని

కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌ఓగా పావని

నంబులపూలకుంట, జూలై 5: స్థానిక కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌ఓగా ఉపాధ్యాయురాలు పావనిని నియమించినట్లు ఎంఈఓలు గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆ పాఠశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లా డారు. విద్యార్థినీలకు నాణ్యమైన విద్యను అందించి, సమయపాలన పాటించాలన్నారు. అనుమతిలేకుండా ఎవరినీ పాఠశాలలోకి అనుమతించకూడదని బోధనేతర సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు తీసుకువచ్చే వంట, కూరగాయలను ఎస్‌ఓ పరిశీలించాలని సూచించారు.

పరిశుభ్రతతోనే అతిసార నియంత్రణ



అతిసార నియంత్రణపై సూచనలిస్తున్న డాక్టర్ నివేదిత

పుట్టపర్తి రూరల్, జూలై 4: అతిసార నియంత్రణలో పరిసరాలు, శారీరక, వ్యక్తిగత పరిశుభ్రతలే కీలకమని జిల్లా ఎస్సీడీ, సీడీ, ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం డైరక్టర్ డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె వైద్యసిబ్బందితో కలసి ప్రశాంతిగ్రాంలోని అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించారు. పిల్లల ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. పిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఆరోగ్య కార్యకర్తలు అనిత, అంగన్‌వాడీ టీచర్ నర్మద, కాలనీవాసులు పాల్గొన్నారు.

పొలం రస్తా సమస్య పరిష్కారం



రస్తాను పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీస్ సిబ్బంది

నంబులపూలకుంట, జూలై 5: మండలంలోని తాటిమానుగుంత గ్రామానికి అనుకుని వ్యవసాయ పొలాలకు వెళ్లే రస్తా వివాదాన్ని తహసీల్దార్ నరేంద్ర కుమార్ శుక్రవారం పరిష్కరించారు. ఈనెల 1న ఆ గ్రామ రైతులు తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తమ పొలాలకు దారి చూపాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ శుక్రవారం పోలీస్ సిబ్బందితో కలిసి ఆ గ్రామానికెళ్లి దారికి అడ్డుగా వేసిన మట్టిని తీసి వేసి రహదారి సమస్యను పరిష్కరించామన్నారు. ఆయన వెంట సీపీఎం నాగిరెడ్డి, సీఐటియు నాగరాజు, పోలీసులు రమణ, రాజు ఉన్నారు.

హిజ్రాల ఘర్షణ

పుట్టపర్తి రూరల్, జూలై 5: ధర్మవరం, పుట్టపర్తికి చెందిన హిజ్రాలు ఘర్షణ పడ్డారు. ఈ హిజ్రాల మధ్య గత కొంతకాలంగా ఆధిపత్య పోరు సాగుతోంది. శుక్రవారం జిల్లాకేంద్రం పరిధిలోని బ్రాహ్మణపల్లిలో హిజ్రా పల్లవి తోటి స్నేహితులతో కలసి జన్మదిన వేడుకలు జరుపుకుంది. ఈ సందర్భంలో ధర్మవరానికి చెందిన హిజ్రాలు పులివెందుల, నెల్లూరుకు చెందిన హిజ్రాలతో కలసి ఆ సంబరాల్లో పాల్గొన్న వారిపై దాడి చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి.. వారిని అడ్డుకున్నారు. ధర్మవరానికి చెందిన హిజ్రా హాసిని ఆధ్వర్యంలో కర్రలు, రాడ్లతో దాడి చేశారని హిజ్రా పల్లవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

దుర్గమ్మకు ఆషాఢమాస పూజలు

ధర్మవరం రూరల్, జూలై 5: పట్టణంలోని దుర్గమ్మ అమ్మవారికి ఆషాఢమాస పూజలను శుక్రవారం నుంచి ప్రారంభించారు. దుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయకమిటీ నిమ్మకాయలు, తీర్థప్రసాదాలు అందజేసింది.



అలంకరణలో దుర్గమ్మ

నల్లలమ్మకు ప్రత్యేక పూజలు



నల్లలమ్మకు పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం రూరల్, జూలై 5: మండలంలోని గొట్లూరు ఎస్సీ కాలనీలో నాలుగేళ్లుగా మూతపడిన నల్లలమ్మ అమ్మవారి ఆలయాన్ని టీడీపీ నాయకులు తెరిపించిన విషయం తెల్సిందే. దీంతో శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకులు గొట్లూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ పేరుమీద అర్చనలు చేయించారు. మూతపడిన అమ్మవారి ఆలయాన్ని తెరిపించినందుకు గ్రామస్థులు, కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

వేమన ఆలయానికి బస్సులు పెంచాలి



వేమన ఆలయంలో మాట్లాడుతున్న సందర్శకులు, గ్రామస్థులు

గాండ్లపెంట, జూలై 5: మండలంలో వేమన ఆలయానికి బస్సు సర్వీసులను పెంచాలని సందర్శకులు, గ్రామస్థులు కోరుతున్నారు. శుక్రవారం కటారుపల్లిలోని యోగివేమన ఆలయంలో చిలమత్తూరు మండలానికి చెందిన సందర్శకులు మాట్లాడుతూ... యోగివేమన ఆలయానికి కర్ణాటక నుంచీ భక్తులు అధికంగా వస్తుంటారని కదిరి నుంచి కటారుపల్లి క్రాస్ వరకు బస్సులో వచ్చామని, అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వేమన ఆలయానికి నడుచుకుంటూ వచ్చామన్నారు. గతంలో పలు సర్వీసులు ఉండేవని, కాని వాటిని రద్దు చేసి కేవలం ఉదయం, సాయంత్రం వేళ్లలో మాత్రమే బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నారన్నారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, మరికొన్ని అదనంగా బస్సులు కేటాయించాలని కోరారు.

బావిలో పడి మహిళ మృతి

గుడిబండ: మండలంలోని రామాయణహట్టి గ్రామానికి చెందిన కిట్టప్ప భార్య మంజుల(27) బావిలోపడి మృతి చెందింది. ఏఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు మంజుల వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి నీరు తాగేందుకు బావి వద్దకు వెళ్లి కాలుజారి బావిలో పడింది. ఈత రాక నీటిలో మునిగి మృతిచెందింది. కేసు దర్యాప్తులో ఉంది.



పరిటాల శ్రీరామ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సభ్యులు

నరసింహస్వామి ఉత్సవాలకు రండి

ధర్మవరం రూరల్, జూలై 5: మండలంలోని పోతుకుంట ఎస్సీ కాలనీలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాలకు తప్పక రావాలని ఆలయ కమిటీ సభ్యులు ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, టీడీపీ తెలుగు మహిళ అధ్యక్షురాలు తలారి వెంకటలక్ష్మీ, పోతలయ్య, రామాంజినేయులు, హరిప్రసాద్, నరసింహమూర్తి, సాయికృష్ణ, రామాంజి, ఫణికుమార్, రాజు, నరేంద్ర, పూజారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇన్నాళ్ల అరాచకాలు మరిచావా.. జగన్..!

ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్



తాడిమర్రి, జూలై 5: తన ఐదేళ్ల పాలనలో అనేక అరాచకాలను సృష్టించిన జగన్‌రెడ్డి.. నేడు కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందని మాట్లాడటం.. దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ ఎద్దేవా చేశారు. ఆయన పాలనలో నాయకుల దౌర్జన్యాలను జగన్‌రెడ్డి అప్పుడే మరిచి పోయారేమోనని విమర్శించారు. తాడిమర్రిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడు తూ.. ఈవీఎంలు పగలకొట్టిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఈసీ చర్యలు చేపట్టి కేసు నమోదు చేయిస్తే దాన్ని జగన్‌రెడ్డి రాజకీయం చేయడం తగదన్నారు. ఐదేళ్ల పాటు పిన్నెల్లి చేసిన దారుణాలను ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. చంద్రయ్యను హత్య చేయించినప్పుడు ముఖ్యమంత్రిగా ఉండి కూడా జగన్ స్పందించలేదన్నారు. అదేవిధంగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేసినా.. చంద్రబాబు ఇంటి ఎదుట నాటి ఎమ్మెల్యే జోగిరమేశ్ నానా బూతులు తిట్టినా ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు తనవరకు వచ్చే సరికి చట్టం... న్యాయం... అంటూ జగన్ రాగాలు తీయడం విడ్డూరంగా ఉందన్నారు.

మొక్కు తీర్చుకున్న తెలుగు మహిళ

కదిరి, జూలై 5: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం, కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ ఎమ్మెల్యేగా గెలవడంతో టీడీపీ మహిళ, పట్టణ మాజీ అధ్యక్షురాలు చల్లా రామాంజులమ్మ తన మొక్కు చెల్లించారు. శుక్రవారం తిరుమల వెంకటేశ్వర స్వామి ఏడుకొండల మెట్లు ఎక్కారు. కందికుంట విజయం కోసం తనతోపాటు భర్త నరసింహులు నాయుడు శ్రమించినట్లు తెలిపారు.

తిరుమల మెట్లు ఎక్కుతున్న రామాంజులమ్మ →



ఘన జీవామృతంపై అవగాహన



గేమేనాయక్ తండాలో శిక్షణ ఇస్తున్న సభ్యులు

తనకల్లు, జూలై 5: మండలంలోని గేమేనాయక్‌తండా, మార్పురివాండ్లపల్లి, నక్కరాళ్ల తండా గ్రామాల్లో ఘనజీవామృతంపై జనజాగృతి ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పురుగుమందులు, రసాయన ఎరువులు అధికంగా పంటలకు ఉపయోగించడం వలన కలిగే నష్టాలను, తద్వారా ఏర్పడే అనర్థాలను వలంటర్ రమణ నాయక్, ప్రకృతి వ్యవసాయ నిపుణురాలు సుప్రియ రైతులకు వివరించారు. ఘన జీవా మృతం తయారీ, నిలువ చేసుకొనే విధానంపై శిక్షణ ఇచ్చారు. బెల్లం, శనగపిండి, స్థాని కంగా దొరికే పుట్టమన్ను, ఆవు పేడ, ఆవు మూత్రంతో ఘన జీవామృతం తయారు చేసి చూపించారు. ఘన జీవామృతాన్ని ఉపయోగించడం వలన భూమి సారంవంతం కావడం తో పాటు పంట దిగుబడి పెరుగుతుందని, వ్యవసాయ పెట్టుబడులూ తగ్గుతాయని వివరించారు.

కదిరిఅర్బన్ : ప్రకృతి వ్యవసాయ పద్ధతు పాటించి ఆరోగ్యకరమైన పంటదిగుబడులు సాధించాలని పుట్టపర్తి ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దిగువపల్లి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కషాయాల తయారీ, ఘన, జల జీవామృతాల తయారీ గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం వలన రసాయనిక ఎరువులు వాడకం తగ్గి, పెట్టుబడులు తగ్గడవే ఒకాకుండా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన టమాటను సందర్శించారు. ఆయన వెంట ఏఓ శ్రీనివాసరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

హోమియో వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న హోమియో వైద్యాధికారి కిష్టయ్య

పుట్టపర్తి రూరల్, జూలై 5: పలు సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు పట్టణంలో ఆయష్ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిష్టయ్య శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వృద్ధులకు మధుమేహం, హైపర్ టెన్షన్, గ్యాస్ట్రిక్ సమస్యలు, చర్మవ్యాధులు, కీళ్ళనొప్పులకు సంబందించిన వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. 162 మంది వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

బుచ్చయ్యగారిపల్లిలో...

బుక్కపట్నం: డయేరియా, అతిసార వ్యాధులు ప్రభులుతున్న నేపథ్యంలో మండలంలోని బుచ్చయ్యగారిపల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ లింగా రామమోహన్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వివరించారు. గ్రామంలో బ్లీచింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మురళి క్రిష్ణ, అరుణ, కార్యదర్శి వర్షా ప్రియదర్శిని, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత

ధర్మవరం, జూలై 5: పట్టణంలోని పార్థసారధి నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్థంగా మారింది. డ్రైనేజీలు పూడుకుపోయి వర్షం వచ్చినప్పుడు ఆ నీరంతా రోడ్లపైకి వచ్చి.. దుర్వాసన వెదజల్లుతుండేది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడసాగారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, మంజులు మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులతో ఆ వార్డులో డ్రైనేజీలను శుభ్రం చేయించారు.



మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్న టీడీపీ నాయకులు

పల్లెకు చేరని వైద్యం

● వైద్యులు లేక నిలిచిపోయిన 104 వాహనం
● గ్రామాల్లో తూతూమంత్రంగా వైద్యసేవలు


చెట్టు క్రింద ఉంచిన 104 వాహనం

మడకశిర రూరల్, జూలై 5: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ఏర్పాటు చేసిన 104 వాహనాలు నిరుపయోగంగా మారాయి. ఇందులో వైద్యుడితో పాటు సిబ్బంది ఉంటారు. ఆసుపత్రి సౌకర్యంలేని సరిహద్దు గ్రామాలను ఎంపి కచేసి 104 వాహనాన్ని ఆయా గ్రామాలకు పంపడం దీని ఉద్దేశం. ఆసుపత్రులకు రాలేని వృద్ధులు, దీర్ఘ కాలిక వ్యాధులతో బాధ పడుతూ మంచాన పడిన వారికి, బాలింతలకు ప్రత్యేక వైద్యసే వలు అందించలన్నాదే ఈ వాహనం యొక్క ముఖ్య ఉద్దేశం. ఆ గ్రామానికి 104 వాహనం వచ్చే సమాచారం రెండు రోజుల ముందే స్థానిక వైద్య సిబ్బంది ప్రజలకు తెలియజేయాలి. గ్రామా నికి వెళ్లిన వైద్యుడు ఉదయం 9-30 గంటల నుంచి మధ్యాహ్నం 12 -30 గంటల వరకు వాహనం దగ్గరికి వచ్చిన రోగులకు వైద్యసేవలు అందిం చాలి. మధ్యాహ్నం 1-30 నుంచి సాయంత్రం 4-30 వరకు గ్రామంలో ఇంటిం టికీ వెళ్లి వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధులతో మంచాన పడ్డవారికి వైద్యం అందించాలి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో 104 వాహన సేవలు అస్తవ్యస్థంగా మారినట్లు గ్రామీణులు వాపోతున్నారు.

● నియోజకవర్గంలో ఐదు మండలాలకు ఐదు 104 వాహనాలు ఉన్నాయి. వాటి పర్యటన ఉన్నతాధికారులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం డాక్టర్, సిబ్బం దితో ఎంపిక చేసిన గ్రామానికి వేళ్ళి ఆ రోజు అక్కడ వైద్యసేవలు అందిం చాలి. ఈ షెడ్యూల్ ప్రకారం శుక్రవారం మండలంలోని భక్తరహళ్ళి గ్రామంలో వాహనం వైద్య సేవలు అందించాలి. డాక్టర్ లేకుండానే వైద్యసి బ్బంది ఆ గ్రామానికి వెళ్లి 104 వాహనాన్ని గ్రామంలో చెట్టు క్రింద ఉంచారు. గ్రామంలోని క్లీనిక్‌లో సాయంత్రం వరకు ఉండి ఎవ్వరూ రాకపోవ డంతో వెనుదిరిగి పోయినట్లు గ్రామస్థులు వాపోతు న్నారు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందివాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విష యమై నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జయవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తాను రెండు రోజులగా సెలవులో ఉన్నానన్నారు. 104 వాహనానికి మరో వైద్యుడిని ఏర్పాటు చేయాల్సి ఉంద న్నారు. వైద్యుడే లేకుండా నామమాత్రంగా పర్యటించి ఏమి చేస్తారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు.


వైద్యుడు లేకపోవడంతో క్లీనిక్ రూమ్‌లో ఉన్న వైద్యసిబ్బంది


మంత్రి సవితను సత్కరిస్తున్న కళాకారులు

మంత్రి సవితకు కళాకారుల సన్మానం

పెనుకొండ, జూలై 5: రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితను స్థానిక శ్రీకృష్ణదేవరాయ కళామండలి సభ్యులు ఘనంగా నిర్వ హించారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కళాకారులు కోగిర జయచంద్రారెడ్డి, కోనాపురం నారాయణస్వామి, కళాపోషకుడు నాగలూరు నారాయణస్వామి, టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు యాదవ్, డ్వాక్రా రామాంజినేయులు, హ్యాండ్స్ నారాయణ, నాగరాజు, బాబిరెడ్డి, తదితరులు మంత్రికి తలపాగా పెట్టి కత్తి చేతికిచ్చి శాలువ కప్పి పూలహారం వేసి ఘనంగా సత్కరించారు. కళారంగం అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరారు.

త్వరలో గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి


పరిశ్రమ నిర్వాహకులతో చర్చిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జూలై 5: పట్టణ సమీపంలోని చీపులేటి వద్ద ఇండి యన్ డిజైన్ గార్మెంట్స్ పరిశ్రమ త్వరలో ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామి తెలిపారు. శుక్రవారం ఇండియన్ డిజైన్ అధినేత సల్మాన్, బెంగ ళూరు నుంచి పలువురు గార్మెంట్ పరిశ్రమ ప్రతినిధులతో కలిసి చీపు లేటి వద్ద నిర్మించిన గార్మెంట్ పరిశ్రమను గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మూడువేల మంది నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకా శాలు కల్పించేందుకు చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. ఈనెల 7వతేదీన గార్మెంట్ పరిశ్రమలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న యువతీ యువకులకు సంబంధించి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. త్వరలో తేదీ నిర్ణయించి పరిశ్రమను ప్రారంభిస్తామని ఆయన అన్నారు.

కెంకరలో వైద్యాధికారుల పర్యటన

మడకశిర(అమరాపురం), జూలై 5: మండల పరిధిలోని హేమా వతి గ్రామ పంచాయతీ కెంకర గ్రామంలో డయేరియాతో నాగ భూషణ అనే వ్యక్తి మృతి చెంద డంతో జిల్లా స్థాయి అధికారులు స్పందించి గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో వాడవాడలా తిరు గుతూ వాంతులు విరేచనాలకు గురైన వ్యక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మంజువాణి, జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మనూనాయక్, డీఎల్‌పీఓ శివనారా యణ, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఈఓఆర్‌డీ నాగమణి, హేమా వతి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ భార్గవ్, డాక్టర్ జయకుమార్, డాక్టర్ మాధవిలతలు గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా మృతుడి భార్యనాలుగు నెలల గర్భిణీ ఒత్తిడికి గురి కాకుండా చూసుకో వాలని ఆశా వర్కర్లకు సూచించారు. ఎస్సీ కాలనీలో తాగునీటి కొళాయి లకు మూతలు లేకుండా నీరు వ్యర్థం కావడం, డ్రైనేజీ వ్యవస్థ లేకుండా మురుగునీరు పారడం గమనించారు. తక్షణమే వాటికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం గ్రామంలో వాంతులు, విరేచనాలు అదుపులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి నరేష్, సిబ్బంది, జిల్లా స్థాయి ఆర్‌ఆర్‌టీమ్ అజీజ్‌ఖాన్, వెంకటరమణ, గోపి పాల్గొన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి మంజువాణి

రేపు జాబ్‌మేళా


కరపత్రాలు విడుదల చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

గుడిబండ, జూలై 5: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. మడకశిర యాదవ కల్యాణమండపంలో ఈనెల7న జాబ్‌మేళా నిర్వహి స్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్య క్షుడు దుర్గేష్, అడ్వకేట్ శివకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి లక్ష్మీనరసప్ప, రిటైర్డ్ డా.కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ భోజరాజు, షబ్బీర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

మండలంలోని గుడిబండ గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పరిశీలిం చారు. రైతులు లోవోల్టేజి సమస్య లేకుండా చూసేందుకు ప్రభుత్వం సబ్‌స్టేషన్ మంజూరు చేసిందన్నారు.

రేపు పావగడకు తుంగభద్ర నీరు


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పావగడ, జూలై 5: పోరాటాల ఫలితంగా ఆదివారం నుంచి పావగ డకు తుంగభద్ర తాగునీరు అందడం ఎంతో హర్షణీయమని రైతు సంఘం నాయకులు పూజారప్ప, బుద్ధ సంఘం నాయకులు మంజు నాథ్, పెద్దన్న, తిప్పేస్వామి అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన వారు 2013సంవత్సరంలో కరువు తాలూకాగా పేరుగాంచిన చళ్లికెరె, మొలకలమూరు, కూర్లగి, చిత్రదుర్గం తాలూకాల తోపాటు పావగడ కూడా జాబితాలో చేరడంతో ఈ ప్రాంతానికి నీరు చేరడం సుగమమైందన్నారు. 2013లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రూ.2,350కోట్లతో విజయనగరం జిల్లా నుంచి దాదాపు 250 కి.మీ పావ గడవరకు పైప్‌లైన్ ద్వారా ఈ నీరు సాగించడానికి ప్రణాళిక తయారు చేసి నిధులు విడుదల చేశారన్నారు. దాదాపు 226 గ్రామాల్లో 46వేల కుటుంబాలు ఈ తాగునీటి లబ్ధి పొందుతారన్నారు. కరువు ప్రాంతమైన పావగడలో తుంగభద్ర నీటితో పంటలు పండి సశ్యశామలంగా మారుతుందన్నారు. నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలన్నారు. తుంగభద్ర నీటి తరలింపునకు సహకరిస్తున్న మాజీ మంత్రి వెంకటర మణప్ప, ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ ఎంపీ జనార్దన్‌స్వామికి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేజీబీవీ తనిఖీ


భోజనాలను పరిశీలిస్తున్న అధికారులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 5 : సోమందేపల్లి మండలం లోని పాపిరెడ్డిపల్లివద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయా(కేజీబీ వీ)ని శుక్రవారం జీసీడీఓ సంపూర్ణదేవి తనిఖీ చేశారు. ఆంధ్రజ్యోతి కథ నంతో స్పందించిన బీసీ సంక్షేమం చేనేత జౌళిశాఖమంత్రి సవిత కేజీబీ వీని సందర్శించిన సంగతి తెలిసిందే. అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం కేజీబీవీని ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. జీసీడీఓ కేజీబీవీ వంటశాల, భోజనం తయారీకి వాడుతున్న రేషన్, కూరగాయలను పరి శీలించారు. అనంతరం భోజన నాణ్యతను పరిశీలించారు. సిబ్బంది సమ యపాలన పాటిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, హాస్టల్ వసతులను గమనించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే సిబ్బందిపై వేటు తప్పద న్నారు. కిటికీలకు కోతులు రాకుండా మెష్ వేయించాలన్నారు. బోధకులు సెల్‌ఫోన్ తీసుకెళ్లరాదన్నారు. అనంతరం నూతన ఎస్ఓ సుబ్బలక్ష్మీకి పలు సూచనలు చేశారు. ఎంఈఓ ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వేటు?

పాపిరెడ్డిపల్లి కేజీబీవీలో విద్యార్థులను వేధించిన ఇన్‌చార్జ్ ఎస్ఓ శాలిని దేవి, మరో ఎస్ఓ అనితపై వేటుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. రెండ్రోజుల క్రితం మంత్రి సవిత ఆదేశాల మేరకు వీరిద్దరిని విచారణ నిమిత్తం సర్వశిక్ష అభియాన్‌కు అప్పగించగా డీఈఓ మీనాక్షి విచారణ పూర్తీచేసిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిసింది. ఈ నేప థ్యంలో వారిరువురిపై వేటు తప్పదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వైసీపీవి తప్పుడు ఆరోపణలు

● టీడీపీ నాయకుల మండిపాటు


బాబురెడ్డితో నిందితులు దిగిన ఫొటోలను చూపుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం అర్బన్, జూలై 5: వైసీపీ నాయకులు తప్పుడు ఆరోప ణలు మానుకోకపోతే తగిన విధంగా బుద్ధి చెప్పాల్సి ఉంటుందని టీడీపీ మండల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేక రుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు రోజుల క్రితం గోళ్ళాపురం గ్రామంలో కొంత మంది వైసీపీకి చెందిన యువకులు గంజాయి సేకరించి అదే గ్రామానికి చెందిన సతీష్ అనే యువకుడిపై దాడి చేశారు. దాడిలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే వైసీపీ నాయకులు మాత్రం దాడి చేసిన వారు టీడీపీ కార్యకర్తలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దొంగే దొంగ అన్న రీతిలో వైసీపీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. దాడి చిన వారు వైసీపీ నాయకుడు బాబురెడ్డితో దిగిన ఫొటోలు చూపించి ఇంత కన్నా రుజువు ఏమి కావాలన్నారు. టీడీపీ హత్యారాజకీయాలకు దూరమని, తమ ఎమ్మెల్యే బాలకృష్ణ ఇలాంటి సహించరన్నారు. హిందూపురంలో మంచి సంస్కృతి ఉందని వైసీపీ అరాచకపాలనతో ఈ ఐదు సంవత్సరాలు అట్టుడుకి పోయిందన్నారు. ఇంకో మారు టీడీపీని విమర్శిస్తే తగిన శాస్తి జరుగుతుదని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డి, మాజీ జడ్పీటీసీలు గోళ్ళాపురం ఆదినారాయణ, సంతేబిదు నూరు శ్రీరాములు, బీసీ సెల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బేవనహళ్ళి ఆనంద్ మాజీ సర్పంచ్ హెచ్.ఎన్ రాము, పట్టాణాధ్యక్షుడు డీఈ రమేష్, నాయ కులు చక్కీరప్ప తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

మడకశిర(అమరాపురం), జూలై 5: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై 18వ సామాజిక తనిఖీ ప్రజావేది కను స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. కార్య క్రమంలో పీడీ విజయప్రసాద్, ఏపీడీ లక్ష్మీనారాయణ, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ భాస్కర్, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, జడ్పీటీసీ స్వారక్క, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉపాధి పీడీ మాట్లాడుతూ మండలంలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికిగాను 589 పనులకుగాను రూ.5.49కోట్లు వెచ్చించినట్లు ఆయన పేర్కొన్నారు. 11 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందం పర్యటించి జరిగిన పనులను పరిశీలించారు. ఇందులో వివిధ పనుల్లో జరి గిన అవకతవకల ద్వారా రూ.37,550 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా మండలంలో బసవనపల్లి, అగ్రహారం, అమరాపురం, శివరం, హలుకూరు, గ్రామ పంచాయతీలలో మృతి చెందిన వారికి కూడా పింఛన్లు అందజేసినట్లు సామాజిక తనిఖీలో వెలుగులోకి వచ్చింది. సంబం ధిత పింఛన్లను రద్దు చేయడానికి సిఫార్సు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈస మావేశంలో ఏపీఓ జగదీష్, జేఈ జగదీష్, సర్పంచ్ జితేంద్ర, ఎంపీటీసీ ఓంకార్‌స్వామి, టెక్నికల్ అసిస్టెంట్ హెన్రీ అరుణ్‌కుమార్, హనుమంతరా యప్ప, తిరుమలగౌడ్, లావణ్య, స్వాతి, గంగప్ప, మంజునాథ్, తదితరులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

రొళ్ల, జూలై 5: మండ లంలోని మల్లినమడు గులో వెలిసిన లక్ష్మీదేవి అమ్మవారికి అమావాస్య శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండా లని రైతులు వేడుకొ న్నారు. మలసముద్రం గ్రామానికి చెందిన రంగప్ప భక్తులకు అన్న దానం, ప్రసాదాలను అందజేశారు.


అలంకరణలో లక్ష్మీదేవి

తుమ్మల మారెమ్మ ఆలయంలో..

గుడిబండ, జూలై 5 : మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మలమారెమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శిం చుకున్నారు.

పశువులకు వ్యాక్సినేషన్

హిందూపురం(సోమందేపల్లి), జూలై 5: మండలంలో మూడు రోజులుగా పాడి పశు వులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం కొనసాగు తోంది. శుక్రవారం నాటికి 955పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యులు బాలాజీనాయక్ తెలిపారు. కూకటిమానుపల్లి, కొనతట్టుపల్లి, తుంగోడులో పశువులకు వ్యాక్సిన్ అందిం చారు. ఇతర పశువులకు వ్యాధిప్రబలకుండా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కార్యక్ర మాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

సచివాలయాల తనిఖీ

మడకశిర టౌన్, జూలై 5: నగర పంచా యతీ పరిధిలోని సచివాలయాలను తహసీ ల్దార్ వెంకటేశులు శుక్రవారం తనిఖీ చేశారు. సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్‌పై సచివాలయాలకు వెళ్లి ఉద్యోగులతో ఆరా తీశారు. మాశేరొప్పం, 14, 15, 16 తదితర వార్డుల పరిధిలోని సచివాలయాలకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌ల ఆదేశాల మేరకు సచివాల యాలకు వెళ్లి క్యాస్ట్ కోసం దరఖాస్తు చేసు కొన్నవారికి సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పావగడ, జూలై 5: నాడ ప్రభు కెంపేగౌడ జయంతి సందర్భంగా స్థానిక బీఆర్‌సీ కార్యాల యంలో నిర్వహించిన విద్యార్థుల ప్రతిభా పోటీ లలో శుక్రవారం విజేతలకు డీఈఓ ఇంద్రాణి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఆరు పా ఠశాలల నుంచి తొమ్మిది మంది విద్యార్థులు చొప్పున డ్రాయింగ్ కాంపిటీషన్, చర్చాగోష్ఠి, వ్యా సరచన పోటీలలో విజేతలైన 54మందికి డీఈఓ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్థిరమైన లక్ష్యంతో చదివితే విజయం సాధించడం కష్టం కాదన్నారు. కార్యక్రమంలో ఆదర్శ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్, టీచర్లు జగన్నాథ్, పాల్గొన్నారు.


ప్రశంసలు పొందిన విద్యార్థులతో డీఈఓ, ఉపాధ్యాయులు

విద్యార్థులకు చేయూత

హిందూపురం, జూలై 5: పట్టణంలోని చౌడేశ్వరీ కాల నీలో చదువుతున్న విద్యార్థులకు చేయూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులు అందజే శారు. శుక్రవారం మదర్స్ ఆసుపత్రి వైద్యులు భానుతేజ, నిఖిల ఆధ్వర్యంలో పెన్నులు, పెన్సిళ్లు, నోటుపుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మధుసుధన్‌రె డ్డి మాట్లాడుతూ ప్రతి యేడాది చేయూత ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోపుస్తకాలు, పెన్నులు ఇవ్వడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి, ప్రేమలత, లక్ష్మీదేవి, కృష్ణారావు, ప్రభాకర్ తదిత రులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలి

లేపాక్షి, జూలై 5 : విద్యార్థులు ఇష్టంతో చదివి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని మండల టీడీపీ కన్వీనర్ జయప్ప పేర్కొ న్నారు. శుక్రవారం స్థానిక మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరా లను అధిరోహించాలన్నారు. మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపుదాం

అగళి, జూలై 5: బాల్య వివాహ వ్యవస్థను రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చే యాలని రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. అగళి మండలం ఇరిగేపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో శుక్రవారం ఆర్డీటి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు అరికడదాం, ఆడబిడ్డలను కాపాడుదాం అనే కార్యక్రమాన్ని టీమ్ లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో బాలికల పట్ల వివక్షత తీవ్రరూపం దాల్చిందని బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు అధికమయ్యా యన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ పై లఘుచిత్రాల ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎక్క డైనా బాల్య వివాహాలు జరుగుతుంటే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 100, 112 సమాచారం అందించాల న్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రమూర్తి, హెడ్‌కా నిస్టేబుల్ సూర్యప్రకాశ్, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కల్లప్ప, ఆర్డీటీ సిబ్బంది బ్రాహ్మణి, శివాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● మరో ముగ్గురికి తీవ్రగాయాలు


అశోక్(ఫైల్)

మడకశిరటౌన్, జూలై 5: మండల పరిధిలోని యు.రంగాపురం గ్రామ సమీపం జాతీయ రహదా రిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్(21) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు యువకులు అశోక్, నవీన్, గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాలకు చెందిన అశోక్, నవీన్, గణేష్, గద్వాలకు చెందిన అనిల్ నలు గురూ స్నేహ కోళ్లఫారంలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. ఈనలు గురూ రెండు ద్విచక్ర వాహనాల్లో మడకశిరకు వస్తుండగా యు.రంగా పురం గ్రామ సమీపంలోకి రాగానే వెనకనుంచి వచ్చిన లారీ బైక్‌లను ఢీకొట్టి వెళ్లింది. రోడ్డుపై పడిపోయిన వారు లేస్తున్న సమయంలో వెనక నుంచి వచ్చిన మరోలారీ వారిపై దూసుకుపోయింది. దీంతో అశోక్ అక్కడిక క్కడే మృతి చెందగా నవీన్, అనీల్, గణేష్ తీవ్రగాయాలతో బయటపడ్డారు. వారిని 108 వాహనంలో మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్ర వారం ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో సంఘటన వివరాలు అడిగి నమోదు చేసుకొన్నారు. ఢీకొట్టిన లారీలను గుర్తించేందుకు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలి స్తామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు గుండుమల తిప్పేస్వామి ఆస్పత్రి వద్దకు వెళ్లి మార్చురీలో అశోక్ మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంఘటన వివ రాలను తెలుసుకొన్నారు. ప్రమాదానికి కారణమైన లారీలను గుర్తించాలని పోలీసులకు సూచించారు.

బావిలో పడి మహిళ మృతి

గుడిబండ, జూలై 5: మండలంలోని రామాయణహట్టి గ్రామానికి చెందిన కిట్టప్ప భార్య మంజుల(27) బావిలోపడి మృతి చెందింది. ఏఎస్ఐ చంద్రశే ఖర్ తెలిపిన వివరాల మేరకు మంజుల వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి నీరు తాగేందుకు బావి వద్దకు వెళ్లి కాలుజారి బావిలో పడింది. ఎవరూ గమనించకపోవడంతో ఈత రాక నీటిలో మునిగి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

మడకశిరటౌన్, జూలై 5: షార్ట్ సర్క్యూట్ కారణంగా పట్టణంలోని సదాశివపురంలో గురువారం అర్ధ రాత్రి నాగలక్ష్మీ అనే మహిళ కిరాణా దుకాణం దగ్ధమయ్యింది. రాత్రి 12 గంటల సమయంలో మూసి ఉన్న షాపు నుండి పొగలు రావడంతో గమనించిన స్థానికులు కౌన్సిలర్ నర సింహరాజుకు సమాచారం ఇచ్చారు. దుకాణంలో సరుకులతోపాటు ఫ్రిడ్జ్, కౌంటర్‌లో డబ్బులు కాలి బూడిద య్యాయి. దాదాపు రూ.5లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. 20 సంవత్సరాల నుంచి కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబ పోషణ సాగించే తనకు జీవనం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, తహసీల్దార్ వెంకటే షులుకు ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు.


దగ్ధమైన దుకాణం

ఎరువుల దుకాణాల తనిఖీ


బిల్లులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

హిందూపురం, జూలై 5 : పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణా లను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. శుక్రవారం వ్యవసాయశాఖ ఉన్నతాదికారుల ఆదేశాలతో ఆశాఖకు చెందిన వ్యవసాయ సహాయ సంచా లకులు పుంగనూరుకు చెందిన శివకుమార్, విజిలెన్స్ అధికారులు రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని నందిని సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో సర్టిఫికెట్ లేకుండా మొక్కజొన్న, వరి విత్త నాలు రూ.23లక్షలు, ఎరువులు, పంటకు పిచికారి చేసే మందులకు సంబం ధించి రూ.81వేలుకు సంబంధించిన బిల్లులకు స్టాప్‌సేల్స్ లేకుండా ఇచ్చి నట్లు గుర్తించారు. దుకాణంలో బిల్లులు ఇవ్వకపోవడం, ఎమ్మార్పీ ధరలకు విక్రయించకపోవడంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, అలా ఇవ్వని పక్షంలో దుకాణ యజమా నిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ సురేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి సహకరించండి : సీపీఎం

గోరంట్ల, జూలై 5: మండలంలోని పాలసముద్రం గ్రామ పరిసరాల్లో జరు గుతున్న ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు కలిగించవద్దని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ అక్బల్ బాషాకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పాలస ముద్రం పంచాయతీ గ్రామాల్లో 20యేళ్లుగా పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వలే దన్నారు. హైకోర్టు అనుమతితో ఇళ్లు నిర్మించుకుంటున్నామన్నారు. ఈకార్య క్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, ఇళ్లస్థలాల పోరాట కమిటీ నాయకులు స్వర్ణలత, ఆంజలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, పెద్దన్న, గంగాధర్, వెంకటరాముడు, ఆంజనే యులు, పోరాట కమిటీ నాయ కులు వెంకటలక్ష్మీ, అచ్చమ్మ, నంజుడప్ప, లోకేష్, లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ ఉన్నారు.


తహసీల్దార్ అక్బల్ బాషాకు వినతి పత్రం అందచేస్తున్న లబ్ధిదారులు

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

మడకశిర, జూలై 5: పిచ్చికుక్క దాడిలో పలువురు గాయపడ్డారు. రొళ్ళ మండలంలోని వట్టిబెట్ట గ్రామంలో పిచ్చికుక్క రెండు రోజుల నుంచి స్వైరవిహారం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం రాత్రి బాలురు రోహిత్, దిలీప్, మహిళ సునంద పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు. కాళ్లు చేతులపై గాట్లు పడ్డాయి. గాయ పడిన వారు మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల నుంచి పిచ్చి కుక్క దాడి లో ఐదు మంది దాకా గాయపడినట్లు బాధితులు వాపోతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజ లను కాపాడాలని వేడుకుంటున్నారు.


గాయపడిన సునందమ్మ

గర్భిణులకు వైద్య పరీక్షలు

హిందూపురం(పరిగి), జూలై 5 : పరిగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు బీపీ, మధుమేహ, పిండ హృదయస్పందన పరీక్ష తదితర పరీక్షలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా డా.నవీన ఉత్తమ ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ పాటించాలని, పోషక విలువలు ఐరన్ సమృద్ధిగా గల ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. 30మంది గర్భిణులకు పరీ క్షలు నిర్వహించారు.

డెంగీపై అవగాహన

డెంగీ వ్యాధిపై వైద్యులు అవగాహన కల్పించారు. పరిగి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు డా.స్వరూపరెడ్డి, సీహెచ్ఓ వన్నప్ప ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోదాలో డెంగీ జ్వరాలపట్ల అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. దోమ, పులిదోమ కాటువల్ల డెంగీ వ్యాప్తి చెందుతుందని, దోమల నివారణతోనే వాధ్యులను అరికట్టవచ్చని వారు తెలిపారు. తీవ్ర జ్వరం, కంటికాపనొప్పి, శరీరంమీద దద్దుర్లు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసి బ్బంది, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.